నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- విత్తన చట్టాలకు లోబడి విక్రయించాలి
- ఎరువులు, విత్తనాలు కొంటే రైతులకు రసీదులు ఇవ్వాలి
- డీలర్లకు సూచించిన వ్యవసాయ శాఖ, పోలీస్ అధికారులు

రామాయంపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎరువులు, విత్తనాల డీలర్లతో సమావేశం

శివ్వంపేట: ఫర్టిలైజర్ దుకాణంలో ఎస్సై మహిపాల్‌రెడ్డి, ఏవో లావణ్య తనిఖీ

రామాయంపేట, మే 30: నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని, డీలర్లు నాసిరకం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని రామాయంపేట సీఐ వెంకటేశ్ హెచ్చరించారు. గురువారం రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డీలర్ విత్తన చట్టాలకు లోబడి విత్తనాలను మార్కెట్లో విక్రయించాలని, రైతులకు కచ్చితంగా రసీదు ఇవ్వాలని, ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి డీలర్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. వ్యాపారి తమ లైసెన్సు గడువు తేదీని చూసుకోవాలన్నారు. గడువు ముగిస్తే వెంటనే రెన్యువల్ చేసుకోవాలన్నారు. వ్యాపారులు తమ దుకాణాల్లో రికార్డులను సక్రమంగా చూసుకోవాలన్నారు. రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు ఉంటాయన్నారు. తనిఖీలో నకిలీ విత్తనాలు, ఎరువులు అని తేలితే దుకాణాన్ని సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో రామాయంపేట వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ, ఎస్సై రంజిత్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, మే 30: మండలంలోని అచ్చంపేట్, ఇబ్రహీంబాద్ గ్రామాల్లో విత్తన కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ సంధ్యారాణి, ఏఈవోలు దుర్గాప్రసాద్, తేజస్విని, రైతులు పాల్గొన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, మే 30: ఫర్టిలైజర్ దుకాణ నిర్వాహకులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఏవో లావణ్య, ఎస్సై మహిపాల్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం శివ్వంపేటలోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో వారు తనిఖీలు నిర్వహించి, రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, మే 30: నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మాసాయిపేట మండల తహసీల్దార్ జ్ఞానజ్యోతి తెలిపారు. గురువారం మాసాయిపేటలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో ఆర్ఐ ధన్‌సింగ్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని రికార్డులు, స్టాక్ రిజిష్టర్లతోపాటు నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా, నాసిరకం, నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే రైతులకు తప్పనిసరిగా రసీదు అందించాలని ఆదేశించారు.


నర్సాపూర్: అచ్చంపేట్‌లో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వెల్దుర్తి: మాసాయిపేటలో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ జ్ఞానజ్యోతి

శివ్వంపేటలో వైకుంఠ రథం ప్రారంభం


వైకుంఠరథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, జడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట, మే 30: పేదలకు జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గురువారం శివ్వంపేటలో స్వర్గీయ పబ్బ అంజయ్యగుప్తా, రామవ్వ జ్ఞాపకార్థం పబ్బ మహేశ్ గుప్తా, పబ్బ రమేశ్ గుప్తాలు రూ.2లక్షల 80వేలతో కొని పంచాయతీకి వైకుంఠ రథాన్ని అందజేశారు. ఈ రథాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, నాయకులు కృష్ణారావు, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ గౌడ్, బీసీసెల్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, యూత్ అధ్యక్షుడు పవన్‌గుప్తా, దుర్గం రమేశ్, పద్మ వెంకటేశ్, లక్ష్మీనర్సయ్య, వెంకటేశ్, ప్రభాకర్‌రెడ్డి, రాంచందర్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మాట్లాడుతున్న జడ్పీటీసీ రాణీ సత్యనారాయణగౌడ్

తూప్రాన్, మే 30: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జూన్ 1 నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించాలని తూప్రాన్ జడ్పీటీసీ రాణి సత్యనారాయణ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం తూప్రాన్‌లోని మమత గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా, అణగారిన వర్గాలు, రైతుల అభ్యున్నతికి ఆవిర్భవించిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. చావు నోట్లో తల పెట్టి తెలంగాణ సాధించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ పాలనలోనే పేదలు, రైతులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఉప సర్పంచ్‌లు, మాజీ వార్డు సభ్యులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బీఆర్ఎస్ శ్రేణులు ప్రతీ గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించాలన్నారు. సమావేశంలో మాచిరెడ్డి కృష్ణారెడ్డి, యావాపూర్ మాజీ సర్పంచ్ శేరి నర్సింహారెడ్డి, మన్నె రమేశ్, అహ్మద్, మహేశ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వద్దు


వీరోజిపల్లి దాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పెద్దశంకరంపేట, మే 30: ధాన్యం కొనుగోలులో అలసత్వం వహించవద్దని, చివరి దశలో ఉందని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని వీరోజిపల్లి, జూకల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ, పీసీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం లారీల అన్‌లోడింగ్ నత్తనడక కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. లారీల అన్‌లోడింగ్ ప్రక్రియ తొందరగా పూర్తి చేయాలన్నారు. త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు పంపించాలని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ గ్రేసీబాయి, ఆర్ఐ శరణప్ప, తదితరులున్నారు.

ప్రిలిమినరీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- ముందుగానే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి
- ఎలక్ట్రానిక్ పరికరాలకు కేంద్రాలలోకి అనుమతి లేదు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ సమావేశంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష

మెదక్ మున్సిపాలిటీ, మే 30: జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం గ్రూప్-1 ప్రిలిమినరీ నిర్వహణపై కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో రాధాకిషన్, ఏఎస్పీ మహేందర్, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే పరీక్షకు జిల్లాలో 3,912 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు సంబంధించి సమస్యలుంటే జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా నెలకొల్పిన కంట్రోల్‌రూమ్ నంబర్ 9908696575కు ఫోన్ చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రశ్నాపత్రాల పంపిణీ మొత్తం సీసీ కెమెరాల నిఘాలో జరగాలన్నారు. పరీక్షకు వచ్చే దివ్యాంగులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు ముందుగానే చేరుకోవాలని, ఆలస్యమైన వారిని అనుమతించేది లేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమావేశంలో డీఆర్వో పద్మశ్రీ, మెదక్ ఆర్డీవో రమాదేవి, డీఆర్డీవో పీడీ శ్రీనివాస్‌రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నర్సస్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

నర్సాపూర్‌లో ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

నర్సాపూర్, మే 30: నర్సాపూర్‌లోని ప్రభుత్వ దవాఖానలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమావేశం ఏర్పాటు చేసుకుని గురువారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ మరియమ్మ, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్ రుదవత్, కోశాధికారి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సస్ అసోసియేషన్ జీవో ఎమ్ఎస్ నెం.358 ప్రకారం ప్రభుత్వంతో ఈ సంఘం గుర్తింపు పొందిందన్నారు. నర్సాపూర్ ఏరియా దవాఖానలో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. అధ్యక్షులుగా శుభలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సత్యశ్రీ, కోశాధికారి జ్యోతి, వైస్ ప్రెసిడెంట్ సువర్ణ, జాయింట్ సెక్రటరీ ధనలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నల్లమట్టితో అధిక దిగుబడులు


కాట్రియాల గ్రామంలో ఉపాధి కూలీలకు నల్లమట్టిపై అవగాహన కల్పిస్తున్న ఏవో

రామాయంపేట, మే 30: నల్లమట్టితో అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజ్ నారాయణ అన్నారు. గురువారం మండలంలోని కాట్రియాల గ్రామంలో ఉపాధి కూలీల వద్దకెళ్లి చెరువు మట్టిపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు కచ్చితంగా చెరువు మట్టిని తమ పంట పొలాల్లో వేసుకోవాలన్నారు. నల్లమట్టితో భూసారం పెరుగుతుందన్నారు. పొలాల్లో మట్టి వేసుకోవడంతో రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. వానకాలం సాగుకు సంబంధించిన జీలుగ విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. అధికారి వెంట ఏఈవో సాయికృష్ణ, రైతులు ఉన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

దుర్గొల్ల ప్రశాంత్ మృతదేహం

నర్సాపూర్, మే 30: భార్య కాపురానికి రావట్లేదని భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దోభీవాడలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్సై పుష్పరాజ్ కథనం ప్రకారం.. నర్సాపూర్ మున్సిపాలిటీలోని దోభీవాడకు చెందిన దుర్గొల్ల ప్రశాంత్ (28)కు 2024 ఏప్రిల్‌లో మెదక్ జిల్లా చేగుంట మండలం రామంతాపూర్ గ్రామానికి చెందిన మనస్విని తో వివాహం జరిగింది. పెళ్లైన 15 రోజులు మాత్రమే భర్తతో కాపురం చేసింది. తన తల్లిగారింటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి, తిరిగి రెండు రోజుల తర్వాత ప్రశాంత్ వద్దకు వచ్చింది. మరో రెండు రోజుల తర్వాత మనస్విని అక్క వచ్చి వారి తండ్రి మృతిచెందిన కేసులో కోర్టులో సాక్ష్యం చెప్పాలని, తనవెంట తీసుకెళ్లింది. అప్పటి నుంచి ఆమె కాపురానికి రాలేదు. తన భార్యకు ఫోన్ చేసి కాపురానికి రమ్మని కోరగా నర్సాపూర్‌లో కాపురం చేయనని, హైదరాబాద్‌లో రూమ్ తీసుకుంటే వస్తానని తెలిపింది. ప్రశాంత్ ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని బాధపడేవాడు. ఈ నెల 29న కూడా తన భార్యకు ఫోన్ చేసి కాపురానికి రమ్మని కోరగా తనతో కాపురం చేయడం ఇష్టం లేదని, రానని తెగేసి చెప్పేసింది. ఈ విషయాన్ని ప్రశాంత్ వాళ్ల అమ్మతో చెప్పాడు. అదేరోజు రాత్రి 7 గంటల సమయంలో తన బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ప్రశాంత్‌ను హుటాహుటిన నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ వెల్లడించారు.

ఫ్లెమింగ్ ల్యాబొరేటరీస్‌పై చర్యలు తీసుకోవాలి: బీజేపీ

శివ్వంపేట, మే 30: మండలంలోని నవాబ్‌పేట గ్రామ పంచాయతీలోని ఫ్లెమింగ్ ల్యాబొరేటరీస్ ప్రైవేటు కంపెనీపై ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ సాదుల అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఫ్లెమింగ్ పరిశ్రమలో కార్మికులకు అందించే ఆహారంలో బల్లిపడడంతో పలువురు కార్మికులు అనారోగ్యంతో దవాఖానలో చేరారని, ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారని అన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు క్యాంటిన్ పరిసరాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమ వదులుతున్న కెమికల్స్‌తో చుట్టుపక్కల ప్రజలు, పశువులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. పంటపొలాలు సైతం దెబ్బతింటున్నాయని, వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

శివ్వంపేట, మే 30: మనస్తాపం చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రత్నాపూర్ గ్రామంలో గురువారం జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి సత్యనారాయణ రోజూ మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవపడేవాడు. ఈ నెల 29న మద్యం తాగి వచ్చి భార్య స్వాతితో గొడవపడ్డాడు. దీంతో స్వాతి ఆమె పిల్లలతో కలిసి అమ్మగారింటికి వెళ్లింది. తీవ్ర మనస్తాపానికి గురైన సత్యనారాయణ రాత్రికి ఇంటిపక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. ఈ విషయమై మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్తపేటలో చోరీ

శివ్వంపేట, మే 30: కొత్తపేట గ్రామంలో చోరీ జరిగిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మన్నె అమృత ఈ నెల 29న రాత్రి కడుపునొప్పి రావడంతో ఇంటికి తాళం వేసి నర్సాపూర్ దవాఖానకు వెళ్లి రాత్రి ఇంటికొచ్చి చూసే సరికి ఇంటి, బీరువా తాళం పగలగొట్టినట్టు ఉంది. దీంతో బీరువాలోని బంగారం, వెండి నగలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించుకెళ్లారని పోలీసులకు తెలిపింది. పోలీసులు ఆమె ఇంటిని పరిశీలించారు. అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సోదరభావంతో మెలగాలి

నిజాంపేట హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్ రెడ్డి

నిజాంపేట్, మే 30: గ్రామస్తులంతా సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్‌లోని హరిజన వాడ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే సమావేశానికి ఎస్సై హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కులం పేరుతో వివక్ష చూపరాదని, కులం పేరిట దూషించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఐ గంగాధర్, కాలనీవాసులు ఉన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన

పెద్దశంకరంపేటలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

పెద్దశంకరంపేట, మే 30: ప్రతి ఆడపిల్లను తప్పకుండా చదివించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శ్రీశైల, నాగమణి, పుష్పలత, కృష్ణవేణి తెలిపారు. గురువారం పెద్దశంకరంపేటలో పూసలగల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరళ, రుక్సానాబేగం, సుక్కమ్మ, విజయలక్ష్మి, స్వరూప తదితరులున్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న ఎంపీపీ యమునా

మెదక్ రూరల్, మే 30: ప్రజా సమస్యలపై గ్రామాల్లో అధికారులు పని చేయాలని ఎంపీపీ యమునా తెలిపారు. గురువారం మెదక్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ప్రజా ప్రతినిధులు పలు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు ఐదేండ్లు సేవ చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘు పీఏసీఎస్ చైర్మన్ సీతారామయ్య, వైస్ ఎంపీపీ ఆంజనేయులు, ఎంపీటీసీ ప్రభాకర్, శ్రీహరి, మానసారాములు, కళావతి, సిద్దాగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా బండ్ల ఊరేగింపు

పెద్దశంకరంపేట, మే 30: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో మాణిక్‌ప్రభు జాతరలో బండ్లను గురువారం ఊరేగించారు. ఆలయంలో స్వామివారికి పండితుల మంత్రోచ్చరణల మధ్య అభిషేకాలు, పూజలు చేశారు. బండ్ల ఊరేగింపులో దేవతామూర్తుల చిత్ర పటాలతో బండ్లను అందంగా అలంకరించారు. శుక్రవారం కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కవితా రమేశ్, మాజీ ఉప సర్పంచ్ పోచయ్య, గ్రామపెద్దలు పల్లె రవి, రమేశ్, ప్రభాకర్, శివరాం, సాయిలు, యాదిరెడ్డి తదితరులున్నారు.

బండ్ల ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

కార్మికులకు సీఐటీయూ అండ

శభాశ్‌పల్లిలో జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు

నర్సాపూర్, మే 30: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో సీఐటీయూ జెండా ను గురువారం ఆవిష్కరించారు. కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ నిరంతరంగా కృషి చేస్తూ కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు కోసం నిరంతరం పోరాటం చేస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. కార్యక్రమంలో సభ్యులు పుష్ప, రాములు, ఆంజనేయులు, శ్రీనివాస్, లింగం తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేటలో

శివ్వంపేట, మే 30: కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ ఎప్పుడూ అండగా ఉంటుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శభాశ్‌పల్లి పంచాయతీలోని సుగుణ ఫుడ్స్ డ్రైవర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ని ర్వహించారు. ప్రధాన కార్యదర్శి యాదగిరి, శ్రీను, ప్రతాప్, సుదర్శన్, శేఖర్, భాస్కర్, రమాకాంత్, రవీందర్, మల్లేశ్‌కుమార్ పాల్గొన్నారు.

జీలుగతో భూసారం పెరుగుతుంది

విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దశంకరంపేట, మే 30: జీలుగ విత్తనాలతో భూసారం పెరుగుతుందని, రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏవో రాజేశ్ అన్నారు. గురువారం పెద్దశంకరంపేట వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందజేశారు. 30 కేజీల జీలుగ విత్తనాల బస్తా రూ.1116కు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందన్నారు. సమావేశంలో ఏఈవోలు స్వాతి, మమత, సుభాశ్, పీఏసీఎస్ సీఈవో రవి, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఆరోగ్య సూచనలు

నారాయణఖేడ్, మే 30: ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యాధికారి రాజేశ్వర్ ఆరోగ్య సూచనలు చేశారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నారాయణఖేడ్ డిపోలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా పరీక్షలకు సంబంధించిన నివేదికల ఆధారంగా అవసరమైన సలహాలిచ్చారు. డీఎం మల్లేశయ్య, ఎంటీ నర్సింహులు, ఎస్‌టీఐ నందులాల్ పాల్గొన్నారు.